నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 కరీంనగర్, గురువారం 13 ఫిబ్రవరి 2025 KARIMNAGAR

## జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటీ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న దాసరి మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 12: జేఈఈ మెయిన్స్ –2025 ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఫలితాలు వెలువడగా, కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాల ప్రైమ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఈఈ మెయిన్స్‌లో వీ రామ్‌చరణ్ 99.49, కే భవేశ్ 98.75, బీ సిద్ధిఖ 98.72, వీ సుధీశ్ 97.61, వివిధ సబ్జెక్టుల వారీగా మ్యాథ్స్ విభాగంలో వీ రాంచరణ్ 99.34, వీ సుధీశ్ 99.00, బీ సిద్ధిఖ 98.72, అసిఫియా నోరిన్ 98.50, వీ వెంకట కృష్ణ 98.43, ఎల్ తిరుపతినాయక్ 98.19, షేక్ బషీరుద్దీన్ 97.47, ఏ చైతన్య 97.07, ఫిజిక్స్ విభాగంలో వీ రామ్‌చరణ్ 98.86, కే భవేశ్ 97.47, కెమిస్ట్రీ విభాగంలో కే భవేశ్ 99.71, బీ సిద్ధిఖ 99.42, వీ రామ్‌చరణ్ 99.14, షేక్ బషీరుద్దీన్ 97.47 శాతం ఫలితాలు సాధించారన్నారు. అనంతరం ఆయన విద్యార్థులను అభినందించారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## కాంగ్రెస్ అంటేనే మోసానికి కేరాఫ్

- కులగణనపై 14న రౌండ్‌టేబుల్ సమావేశం
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసానికి కేరాఫ్ అని, ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల హామీని తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. తెలంగాణలోని బీసీలను అణగదొక్కేందుకే రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని, కులగణన నివేదిక అంతా తప్పుల తడక అని విమర్శించారు. రీ సర్వే చేయకుంటే బీసీల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీసీ కులాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని, ఈనెల 14న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ, ఉప కులాలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పూర్తిగా బీసీలకు అన్యాయం చేసేలా ఉందని మండిపడ్డారు. సర్వేను ఆ పార్టీకి సంబంధించిన నేతలే తప్పు పడుతున్నారని, అయినా మార్పు రావడం లేదని విమర్శించారు. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో సర్వే పేరిట బీసీ కులాల వర్గాలకు చేసిన అన్యాయంతోనే కాంగ్రెస్ పతనం ప్రారంభమైందన్నారు. సర్వేలో ఐదున్నర శాతం బీసీ జనాభా తగ్గించి చూపిన రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మాత్రమే బీసీలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, అచ్చ వేణు, కల్వచర్ల కృష్ణవేణి, సట్టు శ్రీనివాస్, ఐలయ్య, సంధ్యారెడ్డి, రామకృష్ణ, వెంకన్న, కిరణ్, సారయ్య, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్‌ఫ్లూ భయం!




పుకార్ల కలకలం

- కోళ్లకు వైరస్ వస్తున్నదనే ప్రచారం
- 'చికెన్ తినాలా.. వద్దా..?' అనే మీమాంస
- ఆందోళనలో పౌల్ట్రీ పరిశ్రమ
- ముందు జాగ్రత్తలో పశువైద్య శాఖ
- ఇక్కడ ఆ వైరస్ లేదంటున్న పశువైద్యులు
- నేడు కరీంనగర్‌లో సమావేశం

కోళ్ల పరిశ్రమను మరో వైరస్ భయపెడుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూతో కుప్పలు తెప్పలుగా కోళ్లు మృతి చెందుతున్నట్టు వస్తున్న వార్తలు ఉమ్మడి జిల్లావాసులను కలవరపెడుతున్నవి. అధికారులు కూడా అప్రమత్తం కావడంతో చికెన్ ప్రియుల్లో కూడా చికెన్ తినాలా.. వద్దా..? అనే మీమాంస నెలకొంటున్నది. ఈ పరిణామాలు క్రమంగా పౌల్ట్రీ పరిశ్రమపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తున్నది. అయితే, జిల్లాలో ఎలాంటి వైరస్ లేదని, చికెన్, గుడ్లు తినవచ్చని, భయం వద్దని పశుసంవర్ధక అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇటు ముందస్తుగా అప్రమత్తం చేస్తూ.. పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



కరీంనగర్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలను బర్డ్ ఫ్లూ వణికిస్తున్నది. అక్కడి కోళ్ల పరిశ్రమ కుదేలవుతున్నది. ఆంధ్రా సరిహద్దులోని కొన్ని తెలంగాణ జిల్లాల్లో కూడా ఈ వైరస్ సోకిందనే పుకార్లు షికార్లు చేస్తుండగా, మన రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇతర రాష్ట్రాల నుంచి వైరస్ రాకుండా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నది. ఇటు బాయిలర్, అటు లేయర్ కోళ్లు ఇతర ప్రాంతాల నుంచి రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఉమ్మడి జిల్లాకు వచ్చే బాయిలర్ కోళ్ల రవాణా నిలిచి పోయింది. గుడ్లను కూడా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం ఆగిపోయింది. కానీ, లేనిపోని పుకార్లతో భయం వెంటాడుతున్నది. బర్డ్ ఫ్లూ లేదని అధికారులు కొట్టిపారేస్తున్నా.. జిల్లావాసులు చికెన్ తినాలంటే భయపడుతున్నారు. కోడి గుడ్లు కూడా తినేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ పరిణామాలు ఉమ్మడి జిల్లా పౌల్ట్రీపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పుకార్ల షికార్లు

కోళ్లలో బర్డ్ ఫ్లూ వైరస్ విజృంభిస్తున్నదని, చికెన్ తినవద్దని ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. నిజానికి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వైరస్ ప్రభావం ఉన్నా.. మన తెలంగాణలో లేదు. కానీ, పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో చికెన్ ప్రియులు భయపడుతున్నారు. వారానికి రెండు మూడు సార్లు లొట్టలేసుకొని తినే వారంతా ఇప్పుడు వెనకాముందు అవుతున్నారు. అయితే చికెన్, గుడ్లు తినవచ్చని, ఎలాంటి భయం వద్దని పశుసంవర్ధక అధికారులు చెబుతున్నా.. అపోహలు మాత్రం వీడడం లేదు. సోషల్ మీడియా ప్రచారంతో పౌల్ట్రీ పరిశ్రమ నష్టపోయే ప్రమాదముందనే ఆందోళన యజమానుల్లో వ్యక్తమవుతున్నది.

### ఎప్పటి వరకు సరిపోవచ్చు?

కరీంనగర్ జిల్లాలో సుమారు 200 పౌల్ట్రీలు ఉన్నాయి. అందులో 72 లక్షల బాయిలర్, లేయర్ కోళ్లు ఉన్నాయి. ఆరు వారాలకోసారి విక్రయించే బాయిలర్ కోళ్లు ఎప్పటి వరకు జిల్లాకు సరిపోతాయనే దానిపై చర్చ నడుస్తున్నది. నిజానికి పౌల్ట్రీ రైతులు బాయిలర్ కోసం కోడి పిల్లలను తెచ్చుకుని పెంచుతారు. ఆరు వారాల తర్వాత వాటిని విక్రయిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో ఇతర రాష్ట్రాల నుంచి కోడి పిల్లలను తెచ్చుకునే పరిస్థితి లేదు. ఇప్పుడున్న కోళ్లు కొద్ది రోజుల వరకే అందుబాటులో ఉండవచ్చు. ఒకవేళ ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులు మెరుగుపడకపోతే మన రాష్ట్రంలో చికెన్ ధరలు విపరీతంగా పెరిగే అవకాశముంటుంది.

### నేడు పశువైద్యాధికారుల సమావేశం

బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం ఇప్పటి వరకైతే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కనిపించడం లేదు. అయినా ప్రభుత్వం ముందు జాగ్రత్తలతో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేయగా, జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఒకసారి పౌల్ట్రీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఎక్కువ మంది రైతులు హాజరు కాకపోవడంతో జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్ రావు ఆదేశాల మేరకు అధికారులే పౌల్ట్రీ రైతుల వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే రైతులకు ఫోన్లు చేసి అప్రమత్తం చేస్తున్నారు. అయితే ఈ విషయమై గురువారం కరీంనగర్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నారు. కోళ్ల పరిశ్రమలను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించి ఆదేశాలు, సూచనలు చేస్తామని జిల్లా పశు వైద్యాధికారి తెలిపారు. తామంతా అప్రమత్తంగా ఉన్నామని, రైతులను కూడా అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. పశువైద్యాధికారులు రైతులకు సలహాలు, సూచనలు కూడా చేస్తున్నారని చెప్పారు. కోళ్లు అసాధారణ రీతిలో చనిపోతే తమ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## సర్కారుకు గుణపాఠం తప్పదు

- నియోజకవర్గంలో కమీషన్ల పాలన
- ఏడాదిన్నరలో అభివృద్ధి శూన్యం
- స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌దే ఘనవిజయం
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం, ఫిబ్రవరి 12 : అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. గన్నేరువరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం నీళ్లు తెచ్చి గన్నేరువరం మండలాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని ప్రశంసించారు. మండలం, నియోజకవర్గానికి తాను ఎంతో చేశానని చెప్పారు. ఏడాదిన్నర కాలంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్లు తీసుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలంటేనే కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాలని, మోసాలపై ప్రజల్లో చర్చ పెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులను, ఇప్పుడు చేస్తున్న పనులపై వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైనికుల్లా పనిచేయాలి

- బీఆర్ఎస్ బలం, బలగాన్ని చూపాలి
- కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎండగట్టాలి
- వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పిలుపు
- బీఆర్ఎస్ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 12 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, బీఆర్ఎస్ బలం, బలగాన్ని చూపించాలని గులాబీ శ్రేణులకు వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎండగట్టాలని, బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధిని వివరించాలని, మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలు ఉన్నంతలో సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ఏడాది పాలనలో అవస్థలు పడుతున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా పూటకోమాట చెబుతూ కాలం గడుపుతున్నదని మండిపడ్డారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీలు అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటే బాగుండనే ఆలోచనలో ఉన్నారని, ఈ రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్ ఉంటేనే మంచిగుంగు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారని, మరోసారి ఆ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధంగా లేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మనం సన్నద్ధం కావాలని, ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డవారికి గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. సమ్మేళనంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోస్కుల రవి, కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సీనియర్ నాయకుడు ఏశ తిరుపతి, బాల్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చయ్య, సురేందర్‌రెడ్డి, వేణుగోపాల్, అంజనీకుమార్, శంకర్, లక్ష్మణ్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్

ప్రారంభించిన గాయని మధుప్రియ


కరీంనగర్‌లో ట్రావెల్స్‌ను ప్రారంభిస్తున్న మధుప్రియ

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 12 : కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైంది. దీనిని ప్రముఖ గాయని మధుప్రియ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్, బెంగళూర్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో సేవలందిస్తున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఉత్తర తెలంగాణ ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. మన జిల్లాలో ట్రావెల్స్ ప్రారంభోత్సవానికి తనను ముఖ్య అతిథిగా పిలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ట్రావెల్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో తాను పాడిన 'గోదారి గట్టుమీద రామచిలకానే' పాటను మరోసారి పాడి అలరించారు. అనంతరం సంస్థ చైర్మన్ ఆర్‌వీ రమణ మాట్లాడుతూ, కాశీ, అయోధ్య టూర్‌కు ₹21,999, బ్యాంకాక్‌కు ₹33,999, మలేషియాకు ₹49,999, యూరప్‌కు ₹3,25,000 ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. చార్ధామ్, అమర్‌నాథ్, ముక్తినాథ్, కర్ణాటక, కాశ్మీర్, కేరళ, తమిళనాడు వంటి దేశీయ యాత్రలతోపాటు విదేశీ యాత్రలపై భారీ డిస్కౌంట్లు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశం ఈ నెల 15 వరకు మాత్రమే ఉందని సూచించారు.

# 'సదరం' బ్రోకర్లకు దడ!






మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం



- సంచలనం రేపిన 'నమస్తే' కథనం
- అక్రమార్కులు అప్రమత్తం
- 'రమ్మన్నపుడే రండి' అంటూ దరఖాస్తుదారులకు సంకేతాలు
- శిబిరానికి తగ్గిన హాజరు శాతం
- క్యాంపునకు రానివాళ్లంతా అనర్హులేనా..?

'సదరం సర్టిఫికెట్‌కు రూ.30 వేలు?' శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనం సంచలనం సృష్టించింది. కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో రెండు రోజులుగా కలకలం రేపుతున్నది. ఇక్కడ జరుగుతున్న అక్రమాలు, బ్రోకర్ల దందా వెలుగులోకి రావడం, సూపరింటెండెంట్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం బ్రోకర్లకు దడ పుట్టించింది. తమకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వారంతా అప్రమత్తమైనట్టు తెలిసింది. సదరం సర్టిఫికెట్ల కోసం ఒప్పందం కుదుర్చుకున్న వారిని శిబిరాలకు రాకుండా అడ్డుకోవడంతోపాటు తాము రమ్మన్నప్పుడే రావాలని చెప్పినట్టు తెలుస్తున్నది. జనరల్ హాస్పిటల్లో ప్రతి రోజూ 250 మందికి పరీక్షలు చేసి దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేస్తుండగా, రోజువారీగా హాజరయ్యే వారి కంటే ఈ రెండు రోజుల్లో సంఖ్య తగ్గడం ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. అయితే ఈ దందా వెనుక ఎవరున్నారనే కోణంలో యంత్రాంగం విచారణ చేస్తున్నట్టు తెలుస్తుండగా, అక్రమార్కుల్లో వణుకు పుడుతున్నది.

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 12 : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో సదరం సర్టిఫికెట్ల పేరిట జరుగుతున్న దందాను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. శిబిరంలో జరుగుతున్న అక్రమాలను, బ్రోకర్లుగా మారిన సిబ్బంది తీరును బయటపెట్టింది. సదరం సర్టిఫికెట్ కోసం ₹30 వేలు డిమాండ్ చేసిన ఏజిల్ సెక్యూరిటీ గార్డును సూపరింటెండెంట్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ దందా చాలాకాలంగా జరుగుతున్నా ఇన్నాళ్లూ పట్టించుకునే వారు లేక వెలుగులోకి రాలేదు. 'నమస్తే' కథనంతో కదలిక మొదలు కాగా, ఈ దందా వెనక చాలా మందే ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. సదరం శిబిరం జరిగితే చాలు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను కింది స్థాయి సిబ్బందికి ఇచ్చి, వారితో ఫోన్లు చేయిస్తున్నట్టు తెలుస్తున్నది. సోమవారం పట్టుబడిన సెక్యూరిటీ గార్డుకు కూడా దవాఖానకు చెందిన ఓ ఉద్యోగి ఈ జాబితా ఇచ్చి ఫోన్లు చేయించినట్టు తెలుస్తున్నది. అయితే ఆ ఉద్యోగి ఎవరని ఆరా తీయగా.. సదరు సెక్యూరిటీ గార్డు దవాఖానలో పీఆర్‌వోగా పనిచేస్తున్న వినయ్ పేరు చెప్పినట్టు సమాచారం. అందులో ఎంత వరకు వాస్తవం ఉందనేది? అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపితే వెలుగులోకి వచ్చే అవకాశమున్నది.

### అర్హత ఉన్నా వసూళ్లు?



సదరం శిబిరానికి రోజుకు 250 మంది వరకు పరీక్షలు చేయించుకుంటారు. అర్హత ఉంటేనే వైద్యులు దివ్యాంగుల సర్టిఫికెట్ జారీ చేస్తుంటారు. నిజానికి అర్హత లేకున్నా సదరం శిబిరం కోసం చాలా మంది స్లాట్ బుక్ చేసుకుంటుంటారు. అందులో 3 నుంచి 4 శాతం మందికి మాత్రమే శాశ్వత వైకల్య సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. కొందరికి ఒకటి రెండేళ్ల వరకు తాత్కాలిక దివ్యాంగ సర్టిఫికెట్లను ఇస్తుంటారు. ఇలాంటి వారు 30 నుంచి 40 శాతం వరకు ఉంటారు. వీరిని పరీక్షిస్తున్న వైద్యులు మాత్రం ఎక్కడ పొరపాట్లు చేయకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. పూర్తి స్థాయి అర్హత ఉన్న వారిని పరీక్షించి దివ్యాంగ సర్టిఫికెట్లు ఇస్తుంటారు. కానీ, మధ్యలో బ్రోకర్లు జోక్యం చేసుకుని అర్హత ఉన్న నిరుపేద దివ్యాంగుల నుంచి కూడా వేలకు వేలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అర్హత లేని వారికి తాత్కాలిక వైకల్య సర్టిఫికెట్లు ఇప్పిస్తూ వారిని మోసం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కింది స్థాయి సిబ్బంది చేస్తున్న ఈ దందా కారణంగా వైద్యుల ప్రతిష్టకు కూడా భంగం కలుగుతున్నది. అయితే ఈ అక్రమాల వెనక ఎవరు ఉన్నారనే విషయమై దవాఖాన ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తున్నది. అక్రమ దందా వెనక ఎవరెవరు ఉన్నారో గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది.

### ఈ నెల కాకపోతే మరో నెల?

దివ్యాంగులు సదరం శిబిరంలో దివ్యాంగ సర్టిఫికెట్లు పొందేందుకు ఒక నెల ముందే మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటారు. అధికారులు వాటిని పరిశీలించి ఆర్థో, ఈఎన్‌టీ, మెంటల్, ఆప్తాల్ తదితర విభాగాలుగా విడదీసి, వారికి తేదీలు కేటాయిస్తుంటారు. ఆ తేదీల్లోనే శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. నిజానికి ఈ శిబిరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆర్గనైజ్ చేస్తుంటుంది. ఆయా తేదీల్లో వచ్చే వారి జాబితాను కూడా ఈ సంస్థనే విడుదల చేస్తుంది. బ్రోకర్లు ఎక్కడి నుంచి ఈ జాబితాను ఎక్కడి నుంచి తీసుకుంటున్నారో తెలియదుగానీ, దివ్యాంగులతో బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. వారికి అనుకూలమైన పరిస్థితులు ఉంటేనే శిబిరానికి రమ్మని, లేదంటే మరో నెల రమ్మని చెబుతున్నారు. ఈ కారణంగా రోజువారీగా నడిచే సదరం శిబిరంలో పూర్తి స్థాయిలో దివ్యాంగులు ఏనాడూ హాజరు కావడం లేదు. ఈ నెల రాని దివ్యాంగులకు మరో నెలలో అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలోనే ఇలా జరుగుతున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది. అయితే ఒకసారి సదరం శిబిరానికి హాజరు కాకుంటే.. తిరిగి ఏడాది వరకు హాజరు కాకుండా ఉంచేలా నిబంధనలు సవరిస్తేనే ఇటు బ్రోకర్ల ఆట కట్టించినట్టవుతుంది. అటు సదరం శిబిరానికి వచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.